సాక్షి
అనంతపురం
మంగళవారం ၊ 5 ၊ సెప్టెంబర్ ၊ 2023



అమృత వర్షం!
ఖరీఫ్ పంటలు ఎండుముఖం పట్టిన తరుణంలో వరుణుడు కరుణించాడు. అమృతంలాంటి నీటితో జీవం పోశాడు. 8లో



టమాట కిలో రూ.20
అనంతపురం కక్కలపల్లి మండీలో సోమవారం కిలో టమాట గరిష్ట ధర రూ.20 ప్రకారం పలికినట్లు రాప్తాడు మార్కెట్ కమిటీ సెక్రటరీ రామ్‌ప్రసాద్ తెలిపారు.

గరిష్ఠం/కనిష్ఠం
29.8°/21.5°
జిల్లా అంతటా సోమవారం తుపాను వాతావరణం నెలకొంది. పగలు, రాత్రి ఉష్ణోగ్రతలు బాగా తగ్గాయి. పగలంతా ఆకాశం మేఘావృతమై చాలా ప్రాంతాల్లో జడితో కూడిన తేలికపాటి వర్షం కురిసింది.

న్యూస్‌రీల్

నిర్లక్ష్యంగా ఉంటే చర్యలు తప్పవు

- బీఎల్వోలకు కలెక్టర్ గౌతమి హెచ్చరిక



బోరంపల్లిలో రీ వెరిఫికేషన్ ప్రక్రియను పరిశీలిస్తున్న కలెక్టర్ గౌతమి

కళ్యాణదుర్గం రూరల్: ఓటర్ల రీ వెరిఫికేషన్‌లో బీఎల్వోలు నిర్లక్ష్యంగా ఉంటే చర్యలు తప్పవని కలెక్టర్ ఎం. గౌతమి హెచ్చరించారు. కళ్యాణదుర్గం మండల పరిధిలోని గోళ్ల, బోరంపల్లిలో సోమవారం రీ వెరిఫికేషన్ ప్రక్రియను ఆమె పరిశీలించారు. జాగ్రత్తగా వెరిఫికేషన్ చేపట్టాలన్నారు. ఎన్నికల కమిషన్ నిబంధనలు పాటించాలన్నారు. డబుల్ ఎంట్రీలు తొలగించాలన్నారు. 18 ఏళ్లు నిండిన ప్రతి ఒక్కరూ ఓటు నమోదు చేసుకోవాలని సూచించారు. నూతన బీఎల్‌ఓలకు ఓరియెంటేషన్ కార్యక్రమం నిర్వహించాలని ఆర్డీఓ నిశాంత్‌రెడ్డికి సూచించారు. అనంతరం ఇంటింటికీ వెళ్లి ఓటరు జాబితాపై ఆరా తీశారు. కార్యక్రమంలో డీఎల్‌డీఓ శంకర్, తహసీల్దార్ ఫణికుమార్, బీఎల్వోలు, ఎన్నికల డీటీ వెంకటేశులు తదితరులు పాల్గొన్నారు.

చిరుత సంచారంతో బెంబేలు



బందార్లపల్లి సమీపంలో సంచరిస్తున్న చిరుత


పెద్దవడుగూరు: మండల పరిధిలోని బందార్లపల్లి సమీపంలో నెల రోజులుగా చిరుత సంచారం కలకలం రేపుతోంది. ప్రజలు తీవ్ర భయాందోళనకు గురవుతున్నారు. వారం క్రితం పడవకొండ ప్రాంతంలో గొర్రెల కాపలాదారులపై చిరుత దాడికి యత్నించింది. దుర్గం కొండ వద్ద శ్రీనివాసులు అనే రైతు వ్యవసాయ పనులు చేసుకుంటుండగా ఎద్దులపై పంజా విసిరింది. ఈ క్రమంలో పొలాలకు వెళ్లేందుకు రైతులు వెనుకాడుతున్నారు. అటవీశాఖ అధికారులు స్పందించి తగిన చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

కొత్తగా 17,111 పింఛన్ల పంపిణీ



అనంతపురం: అర్హులకు తప్పనిసరిగా సంక్షేమ ఫలాలు అందేలా ప్రభుత్వం చర్యలు తీసుకుంటోంది. అందులో భాగంగానే జిల్లాలో కొత్తగా 17,111 పింఛన్లు మంజూరు చేసింది. ఫేజ్-1లో 7,312 మందిని గుర్తించగా, ఫేజ్-2లో మరో 9,759 మంది లబ్ధిదారులను గుర్తించారు. ఇప్పటికే జిల్లాలో 2,72,832 మందికి పింఛన్లు అందిస్తున్నారు. కొత్తవారితో కలిపి సెప్టెంబర్‌లో మొత్తం రూ.80.83 కోట్ల మొత్తాన్ని ప్రభుత్వం విడుదల చేసింది.

గురుభ్యో నమః



వచ్చామా.. చదువు చెప్పామా అని అనుకోలేదు వారు. వినూత్న పద్ధతులు అలవరుచుకుని... పిల్లలు పాఠాన్ని చక్కగా ఆకళింపు చేసుకునేలా వివరించారు. అందుకే ఆ ఉపాధ్యాయులను ప్రభుత్వం గుర్తించింది. ఉత్తమ బోధనతో గురుతర బాధ్యత చాటుకుంటున్న వారిని అవార్డులతో సత్కరించేందుకు ఏర్పాట్లు చేసింది. ప్రభుత్వ బడుల్లో చదువుకునే పిల్లలకూ ప్రపంచం మెచ్చే నైపుణ్యాలు అందించేలా గతంలో ఎన్నడూ లేని విధంగా మార్పులకు శ్రీకారం చుట్టిన జగన్ సర్కారు.. అందులో భాగంగానే ఈ ఏడాది ప్రత్యేకంగా ఐదుగురు ఇంగ్లిష్ మాధ్యమ టీచర్లను పురస్కారాలకు ఎంపిక చేసింది. ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా మంగళవారం అనంతపురం ఆర్ట్స్ కళాశాలలో జరగనున్న వేడుకల్లో ఉన్నతాధికారులు, ప్రజాప్రతినిధులు ఉత్తమ ఉపాధ్యాయులను సత్కరించనున్నారు.

- ఉత్తమ సేవలకు ప్రభుత్వ గుర్తింపు
- 25 మందికి బెస్ట్ టీచర్ అవార్డులు
- తొలిసారి ప్రత్యేక కేటగిరీ కింద ఐదుగురు ఇంగ్లిష్ మీడియం టీచర్లకు పురస్కారం
- ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా నేడు పంపిణీ
- అనంతపురం ఆర్ట్స్ కళాశాల వేదికగా వేడుకలు

రాప్తాడురూరల్: ప్రభుత్వ పాఠశాలల్లో చదువుకునే విద్యార్థులకు వినూత్నంగా, విలక్షణంగా పలువురు టీచర్లు అందిస్తున్న సేవలకు ఫలితం దక్కింది.

ఉపాధ్యాయ దినోత్సవ నేపథ్యం..

భారత తొలి ఉప రాష్ట్రపతి డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ జయంతిని పురస్కరించుకుని ఏటా సెప్టెంబర్ 5న దేశంలో ఉపాధ్యాయ దినోత్సవం జరుపుకుంటారు. అధ్యాపకుడిగా ఆయన చేసిన సేవలకు గుర్తింపుగా కేంద్ర ప్రభుత్వం టీచర్స్ డే ప్రకటించింది.

ఉపాధ్యాయ దినోత్సవాన్ని పురస్కరించుకుని జిల్లాస్థాయిలో అందజేసే ఉత్తమ అవార్డులకు వివిధ కేటగిరీల్లో 25 మంది టీచర్లను ఎంపిక చేశారు. వీరందరికీ మంగళవారం అనంతపురం ఆర్ట్స్ కళాశాల డ్రామా హాలులో జరిగే వేడుకల్లో ప్రజాప్రతినిధులు, అధికారుల చేతుల మీదుగా అవార్డులు అందజేయనున్నారు.

ఇంగ్లిష్‌లో మా'స్టార్లు' వీరే..

వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రి అయిన తర్వాత విద్యారంగంలో విప్లవాత్మక సంస్కరణలు తీసుకొచ్చారు. పేద విద్యార్థులు చదువుకునే ప్రభుత్వ పాఠశాలలను ఇంగ్లిషు మీడియంలోకి మార్చారు. ప్రభుత్వ పిల్లల్లోనూ ఇంగ్లిష్ భాషా నైపుణ్యాలు పెంపొందించేందుకు చర్యలు తీసుకున్నారు. ఈ క్రమంలోనే ఆంగ్ల బోధనలో ఉత్తమ బోధనా నైపుణ్యాలు చూపుతున్న టీచర్లకు అవార్డులు ఇవ్వాలని నిర్ణయించారు. తొలిసారి ప్రత్యేక కేటగిరీ కింద జిల్లాలో ఐదుగురిని ఎంపిక చేశారు.

'సెంటా' ద్వారా గుర్తింపు

టీచర్ల నైపుణ్యాలను పరీక్షించడంలో ప్రపంచంలోనే అతిపెద్ద సంస్థ అయిన సెంటర్ ఫర్ టీచర్ అక్రిడిటేషన్ (సెంటా) సహకారాన్ని ప్రభుత్వం తీసుకుంది. సెంటా ఆధ్వర్యంలో ఇటీవల ఆన్‌లైన్‌లో ప్రావీణ్య పరీక్ష నిర్వహించారు. అందులో ప్రతిభ కనబరచిన ఐదుగురిని జిల్లాస్థాయి ఉత్తమ టీచరు అవార్డులకు ఎంపిక చేశారు. ఉపాధ్యాయ దినోత్సవాన్ని పురస్కరించుకుని మంగళవారం వీరికి అవార్డులు అందజేయనున్నారు.

శ్రీధర్ బోధనకు గుర్తింపు..



పిల్లలకు సులువుగా అర్థమయ్యేలా ఆటలు, పాటల రూపంలో సైన్స్ సబ్జెక్టును ఇంగ్లిష్ మీడియంలో బోధిస్తున్నారు యాడికి మోడల్ స్కూల్ టీజీటీ సైన్స్ టీచరు దాసరి శ్రీధర్. ఈయన గతంలో గుత్తిలో పని చేసే సమయంలో పిల్లలకు ఇంగ్లిష్‌లోనే రాయడం, మాట్లాడేలా తర్ఫీదు ఇచ్చారు. అక్కడ శిక్షణ పొందిన పిల్లలు మంచి స్థాయికి చేరారు. పిల్లల స్థాయిలో చెబితేనే బాగా అర్థం చేసుకుంటారని శ్రీధర్ చెబుతున్నారు.

జిల్లా స్థాయి అవార్డుకు ఎంపికైన ఉపాధ్యాయులు

పేరు	కేడరు	స్కూల్
ఎస్.మహమ్మదీ ముబీనా	ఎస్జీటీ	సోదనపల్లిఎస్సీకాలనీ, శింగనమల
ఆర్.గౌరీ ప్రభావతి	ఎస్ఏ (బీఎస్)	కేజీబీవీ గుత్తి
ఎం.శ్రీవాణి	ఎస్ఏ (పీఈ)	జెడ్పీహెచ్ఎస్ తోపుదుర్తి
ఎన్.ఓంశేఖర్	ఎస్ఏ (బీఎస్)	నంబర్-2 స్కూల్, అనంతపురం
ఎంసీ సుంకన్న	ఎస్ఏ (బీఎస్)	జెడ్పీహెచ్ఎస్ కొనకొండ్ల
కె.జయరాజు	పీఎస్ హెచ్ఎం	చైతన్యనగర్ పామిడి మండలం
ఎస్.శ్రీనివాసులు	ఎస్ఏ (బీఎస్)	జెడ్పీహెచ్ఎస్ ఆత్మకూరు
జి.రామకృష్ణయ్య	ఎస్ఏ (తెలుగు)	జెడ్పీహెచ్ఎస్ రాకెట్ల
బి.చంద్రమోహన్‌నాయక్	ఎస్ఏ (హిందీ)	జెడ్పీహెచ్ఎస్ గూగూడు
కె.మహమ్మద్‌రఫి	ఎస్ఏ (పీఎస్)	జెడ్పీహెచ్ఎస్ బెళుగుప్ప
టి.ఆదిలక్ష్మీ	ఎస్ఏ (హిందీ)	జెడ్పీహెచ్ఎస్ దిమ్మగుడి
కె.రమేష్‌బాబు	ఎస్ఏ (హిందీ)	కేఎస్ఆర్ స్కూల్, అనంతపురం
ఎన్.ఓబులేసు	ఎస్ఏ (బీఎస్)	ఆర్ఎంహెచ్ఎస్, అనంతపురం
బీసీ తిమ్మరాజు	ఎస్ఏ (పీఈ)	జెడ్పీహెచ్ఎస్ గంగవరం
కె.ఎర్రిస్వామి	ఎస్ఏ (బీఎస్)	జెడ్పీహెచ్ఎస్ గంగవరం
డి.చిదంబరరెడ్డి	ఎస్ఏ (తెలుగు)	ఎంపీయూపీఎస్ విరుపాపురం
పి.వెంకటసురేష్	పీఎస్ హెచ్ఎం	దుద్దేకుంట, బెళుగుప్ప మండలం
కె.చన్నబసయ్య	ఎస్జీటీ	బుదివతి, బెళుగప్ప మండలం
హెచ్.రవికుమార్	ఎస్ఏ (బీఎస్)	జెడ్పీహెచ్ఎస్ నేత్రాపల్లి
ఎ.అస్మతార	ఎస్ఏ (ఇంగ్లీష్)	జెడ్పీహెచ్ఎస్ ఎన్.గుండ్లపల్లి
వై.సంగప్ప	ఎస్జీటీ	విరుపాపల్లి, బెళుగుప్ప మండలం
ఎన్.రాజశేఖర్	ఎస్ఏ (పీఈ)	జెడ్పీహెచ్ఎస్, బెళుగుప్ప
కె.యల్లప్ప	ఎస్ఏ సోషల్	జెడ్పీహెచ్ఎస్ 5వ వార్డు పామిడి
ఎన్.సుజాత	ఎస్జీటీ	హెచ్ఎల్‌సీ కాలనీ, కనేకల్
ఎం.మోసెస్	పీఎస్ హెచ్ఎం	జక్కలవడికి, కనేకల్ మండలం



సర్వేపల్లి రాధాకృష్ణన్

సేవకు ఫలితం



విద్యారంగంలో నా సేవలకు సరైన గుర్తింపు దక్కింది. గతేడాది డిప్యూటేషన్‌పై ఎస్కేడీ స్కూల్‌కు వచ్చా. మా స్కూల్ పదో తరగతి విద్యార్థి 583 మార్కులతో జిల్లాలో రెండోస్థానంలో నిలిచాడు. పదో తరగతి విద్యార్థులందరూ ఉత్తీర్ణత సాధించేలా ఇప్పటి నుంచే పక్కా ప్రణాళికతో తర్ఫీదు ఇస్తున్నా. నోట్స్ ఎప్పటి కప్పుడు అప్‌డేట్ చేయిస్తున్నా. రౌండ్ టెస్టులు, స్లిప్ టెస్టులు ఇప్పటి నుంచే నిర్వహిస్తూ వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక దృష్టి సారిస్తున్నా.

– ఎన్.ఓబులేసు, బయాలజికల్ సైన్స్ టీచరు

విద్యార్థి స్థాయికి వెళ్తే సత్ఫలితాలు



టీచరు స్థాయిలో కాకుండా విద్యార్థుల స్థాయికి దిగి బోధన చేయగలిగితే మంచి ఫలితాలు సాధించగలం. నాకు 21 ఏళ్ల స్కూల్ అసిస్టెంట్ సర్వీస్ ఉంది. డిపెప్‌లో పని చేశా. స్కౌట్ మాస్టర్‌గా ఉన్నా. ఎన్‌సీసీలోనూ ఉన్నా. ఆడియో, విజువల్ మెథడ్‌లోనే ఎక్కువగా బోధిస్తున్నా. విశిష్ట సేవలందిస్తున్న నన్ను అవార్డుకు ఎంపిక చేయడం ఆనందంగా ఉంది.

– ఎన్.ఓంకారేశ్వర్, బయాలజికల్ సైన్స్ టీచరు, నంబర్-2 స్కూల్, అనంతపురం

సాంకేతికతను అందిపుచ్చుకుని బోధన



సాంకేతికతను అందిపుచ్చుకుని విద్యార్థులకు అత్యంత సులభంగా అర్థమయ్యేలా బోధిస్తున్నా. ప్రభుత్వం సరఫరా చేసిన ఐఎఫ్ ప్యానెళ్లు చాలా బాగా ఉపయోగించుకుంటున్నా. సొంతంగా పీపీటీ (పవర్ పాయింట్ ప్రజెంటేషన్)లు ఇంటివద్దే తయారు చేసుకుని తరగతి గదుల్లో ప్రదర్శిస్తున్నా. ముందుగా లెసెన్ ప్లాన్ పూర్తి చేసి ఆ తర్వాత పీపీటీ, యానిమేషన్ ప్రజెంట్ చేస్తున్నా. ఈ విధానంతో పిల్లలకు సబ్జెక్టు కళ్లకు కట్టినట్లు ఉంటుంది.

– ఎస్.రమేష్‌బాబు, హిందీ స్కూల్ అసిస్టెంట్, కేఎస్ఆర్ ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాల

సులువుగా ఇంగ్లిష్ నేర్పిస్తున్న ప్రియాంక..



అనంతపురం రూరల్ మండలంలోని పంతులకాలనీ ప్రాథమికోన్నత పాఠశాలలో గణితం టీచరుగా పని చేస్తున్న కాకర్ల హరి ప్రియాంకను ప్రభుత్వం అవార్డుకు ఎంపిక చేసింది. పిల్లలకు గణితం సబ్జెక్టును ఇంగ్లిష్ మీడియంలో అర్థమయ్యేలా బోధిస్తున్నారు ప్రియాంక. ఈమె బీఎస్సీ,బీఈడీ ఇంగ్లిష్ మీడియంలోనే చేశారు. పిల్లలకు ఆంగ్లంలో బోధనకు ఇదికూడా బాగా కలిసొచ్చింది. డిజిటల్ బోధనలో భాగంగా ప్రభుత్వం తీసుకొచ్చిన ఇంటరాక్టివ్ ఫ్లాట్ ప్యానెళ్ల (ఐఎఫ్‌పీ) ద్వారా బోధిస్తుంటే పిల్లలకు మరింత సులువుగా అర్థమవుతోందని చెబుతున్నారు హరి ప్రియాంక.

అర్థమయ్యేలా చెప్పడంలో సరస్వతి..



ప్రతి విద్యార్థీ ఇంగ్లిష్‌పై పట్టు సాధించేలా తర్ఫీదు ఇస్తున్నారు రాప్తాడు మండలం హంపాపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఇంగ్లిష్ టీచరు గోపాలం సరస్వతి. అందుకే ఆమెను ప్రభుత్వం గుర్తించింది. తరగతి గదిలో ఏపాఠం చెప్పాలో సరస్వతి ముందుగానే సన్నద్ధమవుతారు. విద్యార్థులు రాసే నోట్ బుక్స్ కరెక్షన్ కచ్చితంగా ఉంటుంది. ప్రతి విద్యార్థిపై వ్యక్తిగత శ్రద్ధ తీసుకుంటూ...స్పోకెన్ ఇంగ్లిష్ శిక్షణ ఇస్తున్నారు. ఇద్దరు, ముగ్గురు విద్యార్థుల మధ్య పోటీలు పెట్టడం, వారితో ఇంగ్లిష్‌లోనే పాటలు పాడించడం ద్వారా ఆంగ్ల భాషపై పట్టు సాధించేలా చేస్తున్నామని సరస్వతి చెబుతున్నారు.

వినూత్న బోధనలో రంగనాథ్ దిట్ట..



అనంతపురం జ్యోతిరావు పూలే మునిసిపల్ కార్పొరేషన్ ప్రాథమిక పాఠశాలలో ఎస్జీ టీచరుగా పని చేస్తున్న ఎస్.రంగనాథ్ అవార్డుకు ఎంపికయ్యారు. ఇంగ్లిష్ మీడియం పిల్లలకు సులువుగా అర్థమయ్యేలా రంగనాథ్ వినూత్నంగా బోధిస్తుండడం గమనార్హం. ప్రాథమిక స్థాయి తరగతుల పిల్లలకు ఇంగ్లిష్ అంటే భయం కలగకుండా సాంకేతికను అందిపుచ్చుకుని అందుబాటులో ఉన్న ప్రాజెక్టర్ ద్వారా, వీడియో, ఆడియోల ద్వారా అర్థమయ్యేలా నేర్పిస్తున్నారు. చెప్పడం కంటే కూడా వీడియోలు చూపిస్తూ ఆడియోల ద్వారా వినిపించడం వల్ల సులువుగా అర్థం చేసుకునే అవకాశం ఉంటుందని రంగనాథ్ తెలిపారు.

రవీంద్రారెడ్డి తపనకు అవార్డు..



విద్యార్థులకు కష్టమైన అంశాలను ఈజీగా నేర్పించేందుకు తాడిపత్రి జేహెచ్ఆర్ మునిసిపల్ బాలికల ఉన్నత పాఠశాల సోషల్ టీచరు యల్లబోయిన రవీంద్రారెడ్డి తపన పడుతుంటారు. 23 ఏళ్ల సర్వీసులో 14 ఏళ్లుగా ఇదే పాఠశాలలోనే చదువు చెబుతున్నారు. పాఠ్య పుస్తకాల్లో ఉన్న అన్ని అంశాలను పిల్లలు అర్థం చేసుకోలేరని, ముఖ్యంగా పదో తరగతి విద్యార్థులను ఉత్తీర్ణతను దృష్టిలో ఉంచుకుని తక్కువ నోట్స్ ఇస్తూ...అతి ముఖ్యమైన అంశాలపై అవగాహన కల్పిస్తూ మంచి ఫలితాలు సాధిస్తున్నామని రవీంద్రారెడ్డి చెప్పారు.

ప్రభుత్వాస్పత్రుల్లో 'కార్పొరేట్' సేవలు

- ఎంపీ తలారి రంగయ్య, ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి



క్రిటికల్ కేర్ యూనిట్ నిర్మాణ శిలాఫలాకాన్ని ఆవిష్కరించిన ఎంపీ రంగయ్య, ఎమ్మెల్యే అనంత, చిత్రంలో జెడ్పీ చైర్‌పర్సన్ గిరిజమ్మ, మేయర్ వసీం తదితరులు

అనంతపురం క్రైం: ప్రభుత్వాస్పత్రుల్లో 'కార్పొరేట్' తరహా సేవలు అందుతున్నాయని ఎంపీ తలారి రంగయ్య, ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి తెలిపారు. నగరంలోని సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రి ఆవరణలో రూ.23.75 కోట్లతో ఏర్పాటు చేయనున్న క్రిటికల్ కేర్ బ్లాక్ నిర్మాణ పనులకు సోమవారం జెడ్పీ చైర్‌పర్సన్ బోయ గిరిజమ్మ, మేయర్ వసీంతో కలసి వారు భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా ఎంపీ రంగయ్య మాట్లాడుతూ విద్య, వైద్యానికి ప్రభుత్వం పెద్దపీట వేస్తోందన్నారు. సీఎం చొరవతోనే క్రిటికల్ కేర్ బ్లాక్‌ను ఏర్పాటు చేస్తున్నట్లు పేర్కొన్నారు. ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి మాట్లాడుతూ ఇప్పటికే నాడు–నేడు కింద రూ.300 కోట్లతో సర్వజనాస్పత్రి విస్తరణ పనులు జరుగుతున్నాయన్నారు. సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రిలో 500కు పైగా మేజర్, మైనర్ శస్త్రచికిత్సలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఇప్పటివరకూ 38 వేల మందికి ఓపీ సేవలందించిడం గర్వకారణమన్నారు. ప్రైవేటుగా ఈ సేవలు పొందాలంటే రూ.లక్షల్లో ఖర్చు చేయాల్సి ఉంటుందన్నారు. జెడ్పీ చైర్‌పర్సన్ బోయ గిరిజమ్మ మాట్లాడుతూ ప్రభుత్వం వైద్య రంగాన్ని బలోపేతం చేసిందన్నారు. మేయర్ వసీం మాట్లాడుతూ నగరంలో నాలుగు ప్రాంతాల్లో పట్టణ ఆరోగ్య కేంద్రాల భవనాలు పూర్తయ్యాయని, త్వరలో మరో రెండు పూర్తి కానున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో ప్రభుత్వ వైద్య కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ శ్రీదేవి, సర్వజనాస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ కేఎస్ఎస్ వెంకటేశ్వర రావు, అకడమిక్ వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ సుబ్రహ్మణ్యం, ఆర్ఎంఓ డాక్టర్ పద్మజ, అడ్మినిస్ట్రేటివ్ అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ సౌజన్య కుమార్ తదితరులు పాల్గొన్నారు.

సమన్వయంతో ముందుకెళ్లాలి

సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రి(ఎస్ఎస్‌హెచ్)లో వైద్యుల నియామకాల విషయంలో సమన్వయంతో ముందుకెళ్లాలని ఎంపీ రంగయ్య, ఎమ్మెల్యే అనంత ఆదేశించారు. ఆస్పత్రి అధికారులతో వారు ప్రత్యేకంగా సమావేశం నిర్వహించారు. ఎస్ఎస్‌హెచ్‌లో ఆర్ఎంఓ నియామకంపై సూపరింటెండెంట్, ప్రిన్సిపాల్‌ను ప్రశ్నించారు. సర్వజనాస్పత్రిలో సూపర్ స్పెషాలిటీ భాగమని, నియామకాల అంశాలు వివాదాస్పదం కాకుండా చూసుకోవాలన్నారు. ఎంసీహెచ్ బ్లాక్ ఏర్పాటులో భాగంగా ప్రభుత్వం కేటాయించిన ఆర్అండ్‌బీ కార్యాలయాన్ని ఖాళీ చేయాలని ఎస్ఈని ఎమ్మెల్యే ఫోన్‌లో ఆదేశించారు. ఆర్డీఓ పరిధిలో ఉన్న ట్రైనింగ్ సెంటర్ అప్పగిస్తే ఖాళీ చేయడానికి సిద్ధంగా ఉన్నామని ఎస్ఈ తెలపగా.. ఎమ్మెల్యే వెంటనే ఫోన్‌లో ఆర్డీఓతో మాట్లాడి ఒప్పించారు.

- సర్వజనాస్పత్రిలో బృందా కన్‌స్ట్రక్షన్స్ నిర్వహిస్తున్న బహుళ అంతస్తుల భవన నిర్మాణాలను నిలిపి వేస్తే ఎలాగని ఏపీఎంఎస్ఐడీసీ ఈఈ మహబూబ్‌ను ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి, ఎంపీ తలారి రంగయ్య ప్రశ్నించారు. సంబంధిత కాంట్రాక్టర్‌తో మాట్లాడి, పనులు ప్రారంభించాలని సూచించారు. జీజీహెచ్, సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రులకు ఏ మేరకు నిధులు అవసరమో ప్రతిపాదనలు సిద్ధం చేయాలని సూపరింటెండెంట్ వెంకటేశ్వర రావును వారు ఆదేశించారు. సీఎం వైఎస్ జగన్ దృష్టికి తీసుకెళ్లి ప్రత్యేకంగా నిధుల విడుదలకు కృషి చేస్తామని పేర్కొన్నారు.

ఏ ఒక్క అర్జీ రీ–ఓపెన్ కారాదు



అర్జీలు స్వీకరిస్తున్న కలెక్టర్ గౌతమి



ఈమె పేరు ఎస్. లక్ష్మీదేవి. పామిడి మండలం కండ్లపల్లి గ్రామం. కుష్ఠువ్యాధిగ్రస్తురాలైన ఈమెకు ఐదుగురు సభ్యులతో కూడిన మెడికల్ బోర్డు ధ్రువపత్రం జారీ చేయడంతో పాటు పింఛనుకు అర్హురాలని పేర్కొంది. అయితే పింఛను డబ్బు మాత్రం ఇవ్వడం లేదు. పెన్షన్ మంజూరు చేసినట్లు ఏడాదిన్నర క్రితం జాబితాలో పేరు కూడా వచ్చిందని, అధికారులు మాత్రం ఏవేవో కారణాలు చెబుతూ డబ్బు ఇవ్వడం లేదంటూ సోమవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన 'స్పందన'లో కలెక్టర్ గౌతమి ఎదుట లక్ష్మీదేవి వాపోయింది. స్పందించిన కలెక్టర్.. తక్షణమే సమస్య పరిష్కరించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు.

అనంతపురం అర్బన్: 'స్పందన', 'జగనన్నకు చెబుదాం' కార్యక్రమాల్లో అందే అర్జీల పరిష్కారంలో నిర్లక్ష్యానికి తావివ్వరాదని కలెక్టర్ ఎం.గౌతమి జిల్లా అధికారులను ఆదేశించారు. ఏ ఒక్క అర్జీ రీ–ఓపెన్ కారాదని స్పష్టం చేశారు. సోమవారం కలెక్టరేట్‌లోని రెవెన్యూభవన్‌లో ప్రజల నుంచి కలెక్టర్‌తో పాటు జేసీ కేతన్‌గార్గ్, అసిస్టెంట్ కలెక్టర్ కుశాల్‌జైన్, డీఆర్ఓ గాయత్రిదేవి, ఆర్డీఓ మధుసూదన్, డిప్యూటీ కలెక్టర్ శంకరయ్య అర్జీలు స్వీకరించారు. ప్రజల నుంచి 329 వినతులు అందాయి. కార్యక్రమం అనంతరం అధికారులతో కలెక్టర్ సమీక్షించారు. అర్జీదారులు సంతృప్తి చెందేలా నాణ్యమైన పరిష్కారం చూపాలని ఆదేశించారు.

వినతులు కొన్ని ఇలా..

- వేలిముద్రలు పడకపోవడంతో ఉపాధి బిల్లులు రావడం లేదని కుష్ఠువ్యాధిగ్రస్తులు రామకృష్ణారెడ్డి, క్రిష్ణ, తదితరులు విన్నవించారు. బ్యాంకు బుక్కుకు ఉపాధి హామీ బుక్ లింక్ చేసేందుకు వేలిముద్రలు పడక ఇబ్బంది పడుతున్నామని, ఐరిష్ ద్వారా లింక్ చేయాలని కోరారు.
- జీవనాధారంగా సాగు చేసుకుంటున్న తమ భూములను ఏపీఐఐసీ తీసుకుందని రాప్తాడు గ్రామానికి చెందిన సాకే నాగప్ప, తదితరులు విన్నవించారు. ఆ భూమి తప్ప జీవనానికి ఇతరత్రా ఆధారం లేదని, తమను ఆదుకోవాలని విజ్ఞప్తి చేశారు.

పునఃపరిశీలన 7లోగా పూర్తవ్వాలి

ఓట్ల తొలగింపుపై చేపట్టిన పునఃపరిశీలన ప్రక్రియ ఈనెల 7లోపు పూర్తి చేయాలని కలెక్టర్ గౌతమి ఆదేశించారు. రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి ముకేష్‌కుమార్ మీనా సోమవారం కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. వీసీ అనంతరం అధికారులతో కలెక్టర్ సమావేశం నిర్వహించారు. గడువులోగా 100 శాతం ప్రక్రియ పూర్తిచేయాలని ఆదేశించారు. 8వ తేదీ నుంచి పోలింగ్ కేంద్రాల రేషనలైజేషన్ ప్రక్రియ ప్రారంభించాలని ఆదేశించారు. పోలింగ్ స్టేషన్ ఓటరుకు రెండు కిలోమీటర్ల లోపు ఉండేలా చూసుకోవాలని సూచించారు.

క్లుప్తంగా

7 నుంచి రాష్ట్రస్థాయి బాలికల చెస్ పోటీలు



పోస్టర్లు విడుదల చేస్తున్న ఎమ్మెల్యే వైవీఆర్

గుంతకల్లు టౌన్: జిల్లా చెస్ అసోసియేషన్ ఆధ్వర్యంలో పెంగ్విన్ యాక్టివిటీ క్లబ్ వేదికగా గుంతకల్లులో ఈ నెల 7 నుంచి 10వ తేదీ వరకూ రాష్ట్రస్థాయి అండర్–15 బాలికల ఫిడే రేటింగ్ చెస్ చాంపియన్ షిప్–2023 పోటీలు నిర్వహించనున్నారు. ఈ మేరకు టోర్నీ డైరెక్టర్ నాగార్జున కర్ణాటకమ్ తెలిపారు. ఇందుకు సంబంధించిన పోస్టర్లను సోమవారం గుంతకల్లు ఎమ్మెల్యే వై.వెంకట్రామిరెడ్డి, మున్సిపల్ వైస్ చైర్‌పర్సన్ నైరుతిరెడ్డి, చెస్ క్రీడాకారుడు హేమాద్రి విష్కరించారు. పూర్తి వివరాలకు 95906 33388లో సంప్రదించవచ్చు.

విద్యార్థులకు తపాలా శాఖ బంపర్ ఆఫర్

అనంతపురం సిటీ: ఆరు నుంచి తొమ్మిదో తరగతి వరకు చదువుకుంటున్న విద్యార్థులకు తపాలా శాఖ బంపర్ ఆఫర్ ప్రకటించింది. దీన్ దయాళ్ స్పర్శ యోజన కింద అనంతపురం తపాలా శాఖ డివిజన్ పరిధిలోని విద్యార్థులకు డీడీఎస్‌వై పరీక్ష నిర్వహించనున్నట్లు అనంతపురం హెడ్ పోస్ట్‌మాస్టర్ భానుకుమార్ సోమవారం తెలిపారు. ప్రతిభ చూపిన విద్యార్థులకు ఏడాదికి రూ.6 వేలు చొప్పున స్కాలర్‌షిప్ అందుతుందన్నారు. పోస్టాఫీసుల్లో ఫిలాటెలిక్ డిపాజిట్ ఖాతా (పీడీఏ) కలిగిన వారు మాత్రమే అర్హులన్నారు. పూర్తి సమాచారానికి అనంతపురంలోని హెడ్ పోస్టాఫీసులో సంప్రదించాలని పేర్కొన్నారు.

బాబు పాలనలో కరువు దరువు

- 14 ఏళ్లలో 12 ఏళ్ల దుర్భిక్షం
- బీటీపీకి నీరిస్తామంటూ సీఎం హోదాలో మూడు సార్లు హడావుడి



నాడు

బాబు హయాంలో బీటీపీ దుస్థితి (ఫైల్)



నేడు

సీఎం జగన్ పాలనలో నిండుకుండను తలపిస్తున్న బీటీపీ

రాయదుర్గం: దుర్భిక్షానికి పర్యాయపదం చంద్రబాబు అన్న సంగతిని కరువు జిల్లా రైతులు ఏనాడో సిద్ధాంతీకరించారు. పాత తొమ్మిదేళ్ల సంగతలా ఉంచితే తాజాగా 2014–2019 మధ్య కాలంలోనూ జిల్లాను దుర్భిక్ష పరిస్థితులు అతలాకుతలం చేశాయి. చినుకు జాడ లేక రాయదుర్గం, కళ్యాణదుర్గం రైతుల పాలిట జీవనాడిగా చెప్పుకునే భైరవానితిప్ప (బీటీపీ) ప్రాజెక్టు బీటలు వారింది. సరైన వర్షాలు లేక చెరువులు, కుంటలే కాదు చివరకు వాగులు, వంకలు సైతం ఎండిపోయాయి. రుణమాఫీ హామీని నమ్మి 2014లో ఓటు వేసిన పాపానికి రైతులకు వలసలే శరణ్యమయ్యాయి. 'దగాకోరు పాలన సాగించిన బాబూ.... నేడు ఏ ముఖం పెట్టుకుని వస్తున్నావ్' అంటూ నియోజకవర్గ ప్రజలు ప్రశ్నిస్తున్నారు.

ప్రహసనంలా రెయిన్‌గన్లు

2014–19 మధ్య కాలంలో వర్షాభావ పరిస్థితుల కారణంగా ప్రధాన వేరుశనగ పంట తుడిచి పెట్టుకుపోయింది.ఈ దుర్భిక్ష పరిస్థితులనూ తనకు అనుకూలంగా మార్చుకుని అందిన కాడికి దోచుకునేందుకు అప్పటి సీఎం చంద్రబాబు సిద్ధమయ్యారు. వర్షాభావ పరిస్థితుల నుంచి రైతులను గట్టెక్కిస్తానంటూ తెరపైకి రెయిన్‌గన్లను తీసుకువచ్చారు. గుమ్మఘట్ట మండలం పూలకుంట వద్ద రైతు బోయ నాగన్న పొలంలో 2016లో రెయిన్‌గన్లను ప్రారంభించి, పంటను కాపాడినట్లు అక్కడే ఏర్పాటు చేసిన సభా వేదికపై గొప్పలకు పోయారు. ఆ తర్వాత రెయిన్‌గన్ల తంతు ప్రహసనంలా మారింది. అంతా షో పుటప్‌గానే రైతులు గుర్తించే లోపు పశుగ్రాసం కూడా చేతికి అందకుండా పోయింది.

దగాపడిన బీటీపీ ఆయకట్టు రైతులు

జీడిపల్లి రిజర్వాయర్ నుంచి బీటీపీకి కృష్ణాజలాలు తరలించే విషయంలోనూ అన్నదాతలను చంద్రబాబు మోసం చేశారు. ఈ ప్రాజెక్ట్‌కు రూ.932 కోట్లు కేటాయిస్తూ తొలి ప్యాకేజ్ కింద రూ.358 కోట్లు విడుదల చేస్తున్నట్లు అప్పట్లో ఉత్తుత్తి ఉత్తర్వులు జారీ చేశారు. ప్రధానంగా 1406.89 ఎకరాల్లో చేపట్టాల్సిన భూసేకరణకు పైసా కూడా ఇవ్వలేదు. పైగా, ప్రభుత్వ డీకేటీ భూముల్లో కాలువ తవ్వకాలు చేపట్టి పనులు ముమ్మరంగా సాగుతున్నట్లు రైతులను మభ్య పెట్టారు. ఇలా ఒకటి, రెండు సార్లు కాదు.. ఏకంగా మూడు పర్యాయాలు ఈ ప్రాంత రైతులను చంద్రబాబు దగా పడేలా చేశారు.

సీఎం జగన్ పాలనలో సుభిక్షం

రాయదుర్గం, కళ్యాణదుర్గం ప్రాంతాల్లో నెలకొన్న ఎడారి ఛాయలు ముఖ్యమంత్రిగా వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి బాధ్యతలు చేపట్టిన తర్వాత కనుమరుగయ్యాయి. సాధారణం కంటే అధిక వర్షపాతం నమోదు కావడంతో చెరువులు, కుంటలు జలకళను సంతరించుకున్నాయి. రికార్డు స్థాయిలో బీటీపీకి నీరు చేరుకోవడంతో మూడు పర్యాయాలు గేట్లు ఎత్తి నీటిని దిగువకు విడుదల చేశారు. రెండు నియోజకవర్గాల్లోనూ ఆయకట్టులో పంటల సాగు పండుగలా సాగుతోంది. బీటీపీకి కృష్ణా జలాలు చేర్చేందుకు అవసరమైన పనులు చేపట్టేలా రూ.208 కోట్ల నిధులను విడుదల చేశారు. తొలి విడతగా 762.42 ఎకరాలకు సంబంధించి రూ.80 కోట్లను సీఎఫ్ఎంఎస్ ఖాతాకు జమ చేశారు. ఇందులో ఇప్పటికే 325.52 ఎకరాలకు సంబంధించి రూ.30 కోట్ల పరిహారాన్ని నిర్వాసిత రైతుల ఖాతాలకు అధికారులు జమ చేశారు. మిగిలిన 436.91 ఎకరాలకు రూ.50.18 కోట్లు జమచేసే ప్రక్రియ కొనసాగుతోంది.

నేడే విడుదల.. బాబు హైడ్రామా

చంద్రబాబు, కరువు కవల పిల్లలుగా ఏనాడో సిద్ధాంతీకరించిన రైతులు.. చివరకు 2019 ఎన్నికల్లో ఆయనను గద్దె దింపారు. ప్రస్తుతం 2024 ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో సరికొత్త డ్రామాకు చంద్రబాబు తెరలేపారు. ఇందులో భాగంగా మంగళవారం బళ్లారి నుంచి ఓబుళాపురం చెక్‌పోస్టు మీదుగా మంగళవారం రాయదుర్గానికి ఆయన రానున్నారు. మార్గమధ్యంలో వేదావతి బ్రిడ్జి వద్ద సెల్ఫీ, పల్లెపల్లి గేటు వద్ద రైతులతో ముఖాముఖి, పంటల పరిశీలన తదితర హైడ్రామాలు కొనసాగించనున్నారు. ఆ తర్వాత రాయదుర్గం తేరు బజారు వద్ద సభలో ప్రసంగించి, రాత్రికి రాయల్ కళాశాలలో బస చేస్తారు. అనంతరం బుధవారం ఉదయం కణేకల్లు మీదుగా ఉరవకొండ చేరుకుంటారు.

బాబు మాటలు జనం నమ్మరు



చంద్రబాబు మాటలను ప్రజలెవ్వరూ నమ్మడం లేదు. ప్రజాస్వామ్యంపై బాబుకు చిత్తశుద్ధి లేదు. కరువు పాలన మళ్లీ కావాలని ఎవరూ కోరుకోవడం లేదు. టీడీపీ హయాంలో కంటే జగన్ పాలనలోనే ప్రజలకు అన్ని విధాలుగా మంచి జరుగుతోంది.

– కాపు రామచంద్రారెడ్డి, ప్రభుత్వ విప్

చంద్రబాబు ఎంతకైనా తెగిస్తారు



అధికారం కోసం చంద్రబాబు ఎంతకైనా తెగిస్తారు. ప్రజలను రెచ్చగొట్టి కక్షలు పెంచడంలో ఆయనకు సాటి మరెవ్వరూ లేరు. జగనన్న పాలనలో ప్రజలకు మంచి జరుగుతుంటే ఓర్వలేక ప్రభుత్వంపై నిందలేస్తున్నారు. బీటీపీకి నీరిచ్చే సత్తా ఒక్క సీఎం జగన్‌కు మాత్రమే ఉంది.

– ఉషశ్రీచరణ్, మంత్రి



నాడు

చంద్రబాబు పాలనలో ఎండిన వేరుశనగ పంట



నేడు

జగన్ పాలనలో ఇలా

వర్సిటీల్లో ఉద్యోగ జాతర

- జేఎన్‌టీయూలో 296 పోస్టులు, ఎస్కేయూలో 268 పోస్టుల భర్తీకి త్వరలో నోటిఫికేషన్



నూతన పాలకమండలి సభ్యులతో జేఎన్‌టీయూ (ఏ)వీసీ జింకా రంగజనార్దన



ఎస్కేయూ పాలక మండలి సమావేశంలో పాల్గొన్న సభ్యులు

అనంతపురం: ఉన్నత విద్యను అభ్యసించి, ప్రభుత్వ ఉద్యోగాల కోసం ఎదురు చూస్తున్న నిరుద్యోగులకు జేఎన్‌టీయూ(ఏ), ఎస్కేయూ నూతన పాలక మండలి సభ్యులు తీపి కబురు వినిపించారు. ఆయా వర్సిటీల పరిధిలో ఖాళీగా ఉన్న వందలాది ఉద్యోగాలను భర్తీ చేయడానికి ఆమోదం తెలిపారు. ఇందుకు సంబంధించి ఏర్పాట్లు చురుగ్గా సాగుతున్నాయి. త్వరలో నోటిఫికేషన్ల జారీకి రెండు యూనివర్సిటీల యాజమాన్యాలు రంగం సిద్ధం చేస్తున్నాయి.

మొత్తం 564 పోస్టుల భర్తీకి చర్యలు

జిల్లాకే తలమానికంగా ఉన్న జేఎన్‌టీయూ(ఏ), ఎస్కేయూ పరిధిలో మొత్తం 564 పోస్టుల భర్తీకి ఆయా వర్సిటీల నూతన పాలక మండలి సభ్యులు ఆమోదం తెలిపారు. ఇందులో ఎస్కేయూ పరిధిలో 268 పోస్టులను భర్తీ చేయనుండగా, జేఎన్‌టీయూ(ఏ) పరిధిలో 296 పోస్టులను భర్తీ చేయనున్నారు. ఎస్కేయూలో 35 ప్రొఫెసర్, 65 అసోసియేట్ ప్రొఫెసర్, 168 అసిస్టెంట్ ప్రొఫెసర్ పోస్టులకు అనుమతి లభించింది. ఇప్పటికే భర్తీ కాగా, మిగిలిన పోస్టుల్లో అర్హులను ఎంపిక చేయనున్నారు. ఇందుకు సంబంధించిన రూల్‌ఆఫ్ రిజర్వేషన్, రోస్టర్ పాయింట్లు నిర్ధారణ అయింది. వీటికి ఎస్కేయూ పాలకమండలి సభ్యులు ఆమోదం తెలిపారు. అలాగే జేఎన్‌టీయూ(ఏ) పరిధిలో 26 ప్రొఫెసర్, 50 అసోసియేట్ ప్రొఫెసర్, 220 అసిస్టెంట్ ప్రొఫెసర్ పోస్టుల భర్తీకి పాలకమండలి సభ్యులు ఆమోదం తెలిపారు. అయితే ఇందులో ఇప్పటికే భర్తీ చేసిన పోస్టుల మినహా మిగిలిన వాటిని భర్తీ చేయనున్నారు.

తొలి సమావేశంలోనే విప్లవాత్మక నిర్ణయాలు

జేఎన్‌టీయూ (ఏ) నూతన పాలక మండలి సభ్యులుగా బాధ్యతలు తీసుకున్న ప్రొఫెసర్ బి.దుర్గాప్రసాద్, ప్రొఫెసర్ వి.వసుంధర, డాక్టర్ డి.జ్యోతీశ్వరి, డాక్టర్ ఎం.రామశేఖరరెడ్డి, డాక్టర్ జి.మేరీమాత, జీవీఎం మోహన్‌కుమార్, డాక్టర్ డి.హరిశ్చంద్ర రామ, డాక్టర్ ఎం.వంశీకృష్ణను ఆ వర్సిటీ వీసీ డాక్టర్ జింకా రంగజనార్దన, రిజిస్ట్రార్ సి.శశిధర్ ప్రత్యేకంగా అభినందించారు. సోమవారం వర్సిటీలోని పాలక భవనంలో నూతన సభ్యులతో వారు సమావేశమై మాట్లాడారు. ఈ సందర్భంగా పాలనపరమైన పలు అంశాలపై సుదీర్ఘ చర్చ సాగింది. అలాగే ఎస్కేయూలో నూతన పాలక మండలి సభ్యులు సోమవారం తొలి సమావేశం నిర్వహించారు. సభ్యులు ప్రొఫెసర్ ఎం. మునినారాయణప్ప, ప్రొఫెసర్ ఎ.కృష్ణకుమారి, డాక్టర్ జేవీవీఎస్ కేశవరావు, డాక్టర్ ఎస్.శ్రీలక్ష్మి, రామిరెడ్డి, దేశాయి మదన్‌మోహన్ రెడ్డి, ఇలియాజ్ అహమ్మద్, కొమ్ము విజయభాస్కర్‌ను ఆ వర్సిటీ వీసీ డాక్టర్ మాచిరెడ్డి రామకృష్ణారెడ్డి, రిజిస్ట్రార్ ఎంవీ లక్ష్మయ్య అభినందించారు. కాగా, రెండు వర్సిటీల పరిధిలో ఖాళీగా ఉన్న పోస్టుల భర్తీకి సంబంధించి నూతన సభ్యులు విప్లవాత్మక నిర్ణయం తీసుకోవడంపై సర్వత్రా హర్షం వ్యక్తమవుతోంది.

పంచాయతీరాజ్‌లో పలువురికి పదోన్నతి

- ఉమ్మడి జిల్లాలో నలుగురు డీఈఈలకు ఈఈలుగా అవకాశం

అనంతపురం సిటీ: పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖలోని ఇంజినీరింగ్ విభాగంలో పదోన్నతులకు ప్రభుత్వం గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. ఉమ్మడి అనంతపురం జిల్లాకు సంబంధించి నలుగురు డీఈఈలు పదోన్నతుల జాబితాలో ఉన్నారు. వారిలో పీఐయూ–కళ్యాణదుర్గం డీఈఈగా ఉంటూ అనంతపురం ఇన్‌చార్జ్ ఈఈగా వ్యవహరిస్తున్న శంకరయ్య, హిందూపురం డీఈఈగా పని చేస్తూ పెనుకొండ ఇన్‌చార్జ్ ఈఈగా వ్యవహరిస్తున్న బండారు మురళీమోహన్, పీఆర్ ఎస్ఈ కార్యాలయ ఆవరణలోని సెంట్రల్ ల్యాబ్‌లో పని చేస్తున్న జి.రవి, గతంలో మడకశిరలో పని చేసి, ప్రస్తుతం కడపలో విధులు నిర్వర్తిస్తున్న చంద్రశేఖర్‌కు పదోన్నతులు లభించనున్నాయి. వీరందరికీ ఒకట్రెండు రోజుల్లోనే పోస్టింగులు రానున్నాయి.

ఈఈలుగా పదోన్నతి

అనంతపురం క్రైం: జిల్లాలోని నగరపాలక సంస్థ, మునిసిపాలిటీల్లో విధులు నిర్వర్తిస్తున్న డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్లకు ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్లుగా పదోన్నతి లభించింది. ఈ మేరకు ఈసోమవారం ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. అహుడాలో డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్‌గా ఉన్న జి.సూర్యనారాయణ పదోన్నతిపై అనంతపురం నగరపాలక సంస్థ ఈఈగా నియమితులయ్యారు. అలాగే ధర్మవరం మునిసిపాలిటీలో పనిచేస్తున్న డీఈఈ కె.సుధారాణి అనంతపురం నగరపాలక సంస్థ ఈఈగా నియమితులయ్యారు. గుంతకల్లు మునిసిపాలిటీలో డీఈగా ఉన్న గురప్పయాదవ్ అదే మునిసిపాలిటీలో ఈఈగా నియమితులయ్యారు. గుత్తి మునిసిపాలిటీ డీఈ ఉన్న ఇంతియాజ్ అలీ ఒంగోలు మునిసిపాలిటీ ఈఈగా నియమితులయ్యారు.

బాబు పర్యటనపై తమ్ముళ్ల రచ్చ

- పరిశీలకుల ఎదుటే బాహాబాహీ



పార్టీ కార్యాలయ వద్ద వాగ్వాదం చేసుకుంటున్న టీడీపీ కార్యకర్తలు

కళ్యాణదుర్గం: ఈ నెల 6న చంద్రబాబు కళ్యాణదుర్గం పర్యటన నేపథ్యంలో టీడీపీలో వర్గపోరు తారాస్థాయికి చేరుకుంది. స్థానిక టీడీపీ కార్యాలయంలో సోమవారం ఆ పార్టీ ఎమ్మెల్సీ భూమిరెడ్డి రాంగోపాలరెడ్డి, పార్టీ పరిశీలకులు బీటీ నాయుడు టీడీపీ నాయకులతో సమావేశమై పర్యటన ఏర్పాట్లపై చర్చించారు. అయితే పార్టీ అధినేత పర్యటనపై తమకు ఎలాంటి సమాచారం ఇవ్వకుండానే పార్టీ ఇన్‌ఛార్జ్ మాదినేని ఉమామహేశ్వర నాయుడు ఏకపక్షంగా రూట్ మ్యాప్ ఖరారు చేశారంటూ మాజీ ఎమ్మెల్యే ఉన్నం హనుమంతరాయ చౌదరి వర్గీయులు గోళ్ల వెంకటేశులు, జెడ్పీటీసీ రామ్మోహన్ చౌదరి, నాయకులు చౌళం మల్లికార్జున, పాపంపల్లి రామాంజినేయులు తదితరులు నిలదీశారు. రూట్‌మ్యాప్‌ను మార్చాలని డిమాండ్ చేశారు. అదే సమయంలో పార్టీ కార్యాలయం వద్ద ఫ్లెక్సీలు చించివేతపై ఇరు వర్గాలు బాహాబాహీకి దిగాయి.

శనగల వ్యాపారిపై రైతుల ఫిర్యాదు



ఫిర్యాదు చేసేందుకు వచ్చిన రైతులు

బొమ్మనహాళ్/బెళుగుప్ప: కష్టపడి పండించిన పంటను దళారీ తీసుకెళ్లి డబ్బు ఇవ్వకుండా మోసం చేశాడంటూ పోలీసులకు పలువురు రైతులు ఫిర్యాదు చేశారు. వివరాలు.. బెళుగుప్పకు చెందిన విక్రమ్... రైతులు పండించిన పంట ఉత్పత్తులను కొనుగోలు చేసి, ఇతర ప్రాంతాలకు తరలించి సొమ్ము చేసుకునేవాడు. ఈ క్రమంలోనే కొన్నేళ్ల క్రితమే తన మకాంను బళ్లారికి మార్చిన విక్రమ్.. అప్పుడప్పుడు వచ్చి తన వ్యాపార లావాదేవీలు చూసుకుని వెళ్లేవాడు. రబీ సీజన్ కింద ఇటీవల వందలాది మంది రైతులు పండించిన పప్పు శనగ ఉత్పత్తులను అనామతు (రైతుకు ఇష్టం వచ్చిన సమయంలో అప్పటి గరిష్ట ధరకు విక్రయించడం) కింద సేకరించుకున్న ఆయన.. ఐదు రోజులుగా పత్తాలేకుండా పోయాడు. దీంతో తాము మోసపోయినట్లుగా నిర్ధారించుకున్న బెళుగుప్ప, కణేకల్లు మండలాల్లోని సల్లాపురం, హనకనహాల్, తదితర గ్రామాలకు చెందిన రైతులు సోమవారం బెళుగుప్ప పోలీసులకు ఫిర్యాదు చేశారు. గోదాముల్లో నిల్వ చేసిన శనగ పంటను తమకు అందించాలని కోరారు.

అమృత వర్షం!

- జిల్లావ్యాప్తంగా వాన
- ఒకే రోజు 27 మి.మీ సగటు వర్షపాతం నమోదు
- కోలుకోనున్న ఖరీఫ్ పంటలు



పెద్దవడుగూరు మండలం లక్ష్మంపల్లి వద్ద పొలంలో నిలిచిన వర్షపు నీరు

అనంతపురం అగ్రికల్చర్: వర్షాభావ పరిస్థితులు నెలకొన్న కీలక తరుణంలో జిల్లాలో అమృతం లాంటి వర్షం కురిసింది. ఆదివారం రాత్రి నుంచి సోమవారం ఉదయం వరకు ఒకే రోజు 27 మి.మీ భారీ సగటు వర్షపాతం నమోదైంది. పెద్దవడుగూరు మండలంలో 59.4 మి.మీ, గుత్తి మండలంలో 52.6 మి.మీ అత్యధిక వర్షపాతం నమోదైంది. తాడిపత్రి మండలంలో 52.6 మి.మీ, శింగనమల– 48.2, గార్లదిన్నె–47.4, పెద్దపప్పూరు–46.2, యాడికి–45.4, ఆత్మకూరు–42.2, గుంతకల్లు–42, పుట్లూరు–41.6, పామిడి–35.4, నార్పల–31.4, కళ్యాణదుర్గం –30.4, బుక్కరాయసముద్రం– 30.2, బెళుగుప్ప– 29.6, అనంతపురం 28.2, వజ్రకరూరు–26.6, ఉరవకొండ–24.2, యల్లనూరు–23.8, కూడేరు మండలంలో 21 మి.మీ వర్షపాతం నమోదైంది. మిగిలిన మండలాల్లోనూ మోస్తరు నుంచి తేలికపాటి వర్షం కురిసింది. ఈ నెల సాధారణం 110.9 మి.మీ కాగా ప్రస్తుతానికి 44.4 మి.మీ నమోదైంది. చాలా రోజుల తర్వాత కురిసిన వర్షాలతో జిల్లాలో పంటలకు జీవం పోసినట్లయింది. ఎండుముఖం పట్టిన 2.50 లక్షల హెక్టార్ల ఖరీఫ్ పంటలు కోలుకోనున్నాయి. దీంతోపాటు 1.20 లక్షల హెక్టార్లలో ప్రత్యామ్నాయ పంటల సాగుకు వీలు కలిగింది. వర్షాలు అటు ఖరీఫ్, ఇటు ప్రత్యామ్నాయానికి చాలా మేలు చేస్తాయని రేకులకుంట, కదిరి వ్యవసాయ పరిశోధనా స్థానాల ప్రధాన శాస్త్రవేత్తలు డాక్టర్ బి.సహదేవరెడ్డి, డాక్టర్ డి.సంపత్‌కుమార్ తెలిపారు.

'పోలీసు స్పందన'కు 105 వినతులు



అర్జీదారుతో మాట్లాడుతున్న ఎస్పీ శ్రీనివాసరావు

అనంతపురం శ్రీకంఠంసర్కిల్: జిల్లా పోలీసు కార్యాలయంలోని కాన్ఫరెన్స్ హాల్‌లో సోమవారం నిర్వహించిన స్పందన కార్యక్రమానికి వివిధ సమస్యలపై 105 వినతులు అందాయి. ఎస్పీ కె.శ్రీనివాసరావు స్వయంగా వినతులు స్వీకరించి, అర్జీదారులతో మాట్లాడారు. చట్టపరిధిలోని సమస్యలకు తక్షణ పరిష్కారం చూపాలని సంబంధిత స్టేషన్ హౌస్ ఆఫీసర్లను వర్చువల్ విధానంలో ఆయన ఆదేశించారు. కార్యక్రమంలో అదనపు ఎస్పీ ఆర్.విజయభాస్కరరెడ్డి, సీఐలు ఇందిర, శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

వెటర్నరీ అంబులెన్స్‌ల్లో ఉద్యోగావకాశాలు

అనంతపురం అగ్రికల్చర్: 'హెల్ప్‌లైన్ 1962'లో కింద పనిచేస్తున్న డాక్టర్ వైఎస్సార్ మొబైల్ వెటర్నరీ అంబులేటరీ క్లినిక్‌లో ఖాళీగా ఉన్న పోస్టుల భర్తీకి అధికారులు చర్యలు తీసుకున్నారు. పశువుల డాక్టర్, పారా వెట్, డ్రైవర్ పోస్టుల భర్తీకి ఇంటర్వ్యూలు నిర్వహించనున్నట్లు ఆ విభాగం రాయలసీమ ప్రోగ్రాం మేనేజర్ వరప్రసాద్, జిల్లా మేనేజర్ రామకృష్ణగౌడ్ సోమవారం ఓ ప్రకటన విడుదల చేశారు. ఆసక్తి అర్హత కలిగిన అభ్యర్థులు దరఖాస్తు చేసుకుని ఇంటర్వ్యూకు హాజరు కావచ్చు. వైద్యుడి పోస్టుకు బ్యాచిలర్ ఆఫ్ వెటర్నరీ సైన్స్ (బీవీఎస్సీ), మాస్టర్ ఆఫ్ వెటర్నరీ సైన్స్ (ఎంవీఎస్సీ) పూర్తి చేసిన వారు, విశ్రాంత పశు వైద్యులు అర్హులు. 18 సంవత్సరాలు నిండి పారా వెటర్నరీ డిప్లొమా కోర్సు చేసిన వారు పారావెట్ పోస్టుకు జరిగే ఇంటర్వ్యూలకు హాజరు కావచ్చు. అలాగే పదో తరగతి ఉత్తీర్ణతతో పాటు హెవీ డ్రైవింగ్ లైసెన్స్ కలిగిన వారు డ్రైవర్ పోస్టుకు అర్హులు. అర్హత కలిగిన వారు బుధవారం అనంతపురంలోని సాయినగర్‌లో ఉన్న వెటర్నరీ ఆస్పత్రిలో జరిగే ఇంటర్వ్యూలకు సరైన ధ్రువీకరణ పత్రాలతో నేరుగా హాజరు కావచ్చు. పూర్తి వివరాలకు 88860 88787, 96525 33554లో సంప్రదించవచ్చు.

రెండో రోజూ సర్వే

తాడిపత్రి అర్బన్: తాడిపత్రిలో టీడీపీ నేత జేసీ ప్రభాకర్ రెడ్డి ఇంటి ముందు రెండో రోజు సోమవారం కూడా అధికారులు సర్వే కొనసాగించారు. రోడ్డు కొలతలు తీసుకున్నారు. పాత సర్వే నంబర్ 643 రస్తా పోరంబోకు సరిహద్దు చేసుకుని మార్కు చేసి కొలతలు వేశారు. సర్వే వివరాలను అధికారులు గోప్యంగా ఉంచారు. ఇన్‌స్పెక్టర్ ఆఫ్ సర్వేయర్ ఆర్.వెంకటరత్నం, మున్సిపల్ ప్లానింగ్ సర్వేయర్ మహబుబ్‌బాషా, మండల సర్వేయర్ మధుర లాలస మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

ఘనంగా తల్లిదండ్రుల పాదపూజ



తల్లిదండ్రుల కాళ్లు కడిగి పూజ చేస్తున్న పిల్లలు

రాయదుర్గంటౌన్: స్థానిక మార్కండేయస్వామి ఆలయంలో సోమవారం సాయంత్రం మాతాపిత పూజ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఆలయంలో తల్లిదండ్రులకు పిల్లలతో పాదపూజ చేయించారు. ఈ సందర్భంగా పద్మశాలియ సంక్షేమ సేవా సంఘం అధ్యక్షుడు అరవ శివప్ప మాట్లాడుతూ.. ఆధునిక సమాజంలో తల్లిదండ్రులను గౌరవించాల్సిన తరుణంలో వృద్ధాశ్రమాల్లో చేరుస్తున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. తల్లిదండ్రులను ప్రత్యక్ష దైవమనే భావనను చిరుప్రాయం నుంచే పిల్లల్లో పెంపొందించాలనే సంకల్పంతో ఈ కార్యక్రమాన్ని చేపట్టినట్లు వివరించారు. పద్మశాలియ సంక్షేమ సేవా సంఘం కార్యదర్శి చుంచుల నాగప్ప, ఉపాధ్యక్షుడు సోమపాండు, హనుమంత, డైరెక్టర్లు, యూత్ కమిటీ సభ్యులు, మహిళా కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

నేటి నుంచి మండల స్థాయి అధికారులకు శిక్షణ

అనంతపురం సెంట్రల్: బాల్య వివాహాలు అరికట్టడం, మిషన్ వాత్సల్య పథకం అమలుపై కలెక్టర్ గౌతమి ఆదేశాల మేరకు మండల స్థాయి అధికారులకు శిక్షణా తరగతులు నిర్వహించనున్నారు. ఈ మేరకు ఐసీడీఎస్ ఇన్‌చార్జ్ పీడీ శ్రీదేవి సోమవారం ఓ ప్రకటన విడుదల చేశారు. మంగళవారం అనంతపురం అర్బన్, రూరల్ ప్రాజెక్టుల పరిధిలోని అన్ని మండలాల అధికారులకు అనంతపురంలోని డీఎంహెచ్ఓ కార్యాలయంలోని సమావేశ భవనంలో శిక్షణా తరగతులు ఉంటాయి. అలాగే 8వ తేదీ శింగనమల, 12న పుట్లూరు, 14న కళ్యాణదుర్గం ఆర్డీఓ కార్యాలయం, 16న కణేకల్లు, 20న గుంతకల్లు ఆర్డీఓ కార్యాలయం, 22న పెద్దవడుగూరు మండల పరిషత్ కార్యాలయాల్లో శిక్షణా కార్యక్రమాలు ఉంటాయి.

సంపులో పడి బాలుడి మృతి

కళ్యాణదుర్గం రూరల్: నీటి సంపులో పడి బాలుడు మిథున్ (2) మృతి చెందాడు. కళ్యాణదుర్గంలోని వడ్డె కాలనీలో నివాసముంటున్న అంజి, శ్రీలేఖ దంపతులకు ఓ కుమార్తె, కుమారుడు మిథున్ ఉన్నారు. సోమవారం సాయంత్రం ఆడుకుంటున్న మిథున్ ప్రమాదవశాత్తు నీటి సంపులో పడ్డాడు. ఆలస్యంగా ఈ విషయాన్ని గమనించిన కుటుంబసభ్యులు వెంటనే చిన్నారిని వెలికి తీసి ఆస్పత్రికి తీసుకెళ్లారు. అప్పటికే మిథున్ మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. ఘటనపై పోలీసులు దర్యాప్తు చేపట్టారు.

క్లుప్తంగా

కొత్తపింఛన్లు పంపిణీ



తలుపూరులో కొత్త పింఛన్లు పంపిణీ చేస్తున్న సర్పంచ్ ఓబులేష్

ఆత్మకూరు: మండలంలోని తలుపూరులో సోమవారం సర్పంచ్ ఓబులేష్ ఆధ్వర్యంలో పదిమందికి కొత్త పింఛన్లు అందించారు. సర్పంచ్ మాట్లాడుతూ తలుపూరులో 45 మంది దరఖాస్తు చేసుకున్నారని, ప్రస్తుతం పది మందికి పింఛన్లు మంజూరయ్యాయని, మిగిలిన అర్హులందరికీ త్వరలో పింఛన్లు మంజూరవుతాయన్నారు.

ఎల్కేపీలో రేపు సాయి గోకులం

అనంతపురం కల్చరల్: శ్రీనృత్యకళానిలయం, సాయిట్రస్టు సంయుక్తాధ్వర్యంలో ఈనెల 6న లలితకళాపరిషత్తు వేదికగా సాయిగోకులం కార్యక్రమం జరగనుంది. బుధవారం సాయంత్రం 6 గంటల నుంచి 9 గంటల వరకు సందడిగా సాగే కార్యక్రమంలో చిన్నారులకు గోపికలుగా, శ్రీకృష్ణ వేషధారణలు ఉంటాయని నిర్వాహకులు తెలిపారు. వివరాలకు సెల్: 9849540680, 8712345520లో సంప్రదించాలన్నారు.

క్యాంపస్‌లో మరుగుదొడ్లు నిర్మించాలి



ప్రిన్సిపాల్‌కు సమస్య విన్నవిస్తున్న ఏఐఎస్‌ఏ నాయకులు

అనంతపురం: శ్రీకృష్ణదేవరాయ విశ్వవిద్యాలయంలో మరుగుదొడ్లు నిర్మించాలని ఏఐఎస్‌ఏ నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ ఏ కృష్ణకుమారికి సోమవారం వినతిపత్రం అందించారు. ఏఐఎస్‌ఏ నాయకులు మాట్లాడుతూ సెంట్రల్ లైబ్రరీ, ఆర్ట్స్ బ్లాక్‌లో మరుగుదొడ్ల నిర్మాణం అత్యవసరమన్నారు. నూతన పాలకమండలి సభ్యులు ప్రొఫెసర్ మునినారాయణప్పకు పరిస్థితిని వివరించారు. కార్యక్రమంలో ఏఐఎస్‌ఏ నాయకులు వేమన, రాజనాయక్, వంశీకృష్ణ, తిరుమలేష్, ధనుష్, జయచంద్ర తదితరులు పాల్గొన్నారు.

వర్ష ప్రభావిత ప్రాంతాల్లో అప్రమత్తంగా ఉండాలి



వర్షప్రభావిత ప్రాంతంలో పర్యటించిన మేయర్ వసీం

అనంతపురం క్రైం: వర్ష ప్రభావిత ప్రాంతాల్లో అప్రమత్తంగా ఉండాలని నగరపాలక సంస్థ అధికారులను మేయర్ వసీం ఆదేశించారు. సోమవారం నగరంలోని 37, 43, 45 డివిజన్లలో మేయర్ పర్యటించారు. తుఫాను ప్రభావంతో రానున్న రోజుల్లోనూ వర్షాలు కురుస్తాయని, రాత్రి వేళల్లోనూ లోతట్టు ప్రాంతాల్లో మరింత అప్రమత్తంగా ఉండాలని కార్యదర్శి సంగం శ్రీనివాసులను ఆదేశించారు. పారిశుధ్యం మెరుగునకు చర్యలు తీసుకోవాలన్నారు. కార్పొరేటర్లు ఇస్హాక్, అనిల్‌కుమార్ రెడ్డి, వైఎస్సార్ సీపీ నాయకులు మధు, కిశోర్, తదితరులు పాల్గొన్నారు.

యువత రక్తదానం

అనంతపురం క్రైం: నెహ్రూ యువ కేంద్ర, ఎస్సార్ ఎడ్యుకేషనల్ సొసైటీ ఆధ్వర్యంలో యువత రక్తదానం చేశారు. ఇండియన్ రెడ్‌క్రాస్‌లో డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణ జయంత్యుత్సవాలను పురస్కరించుకొని సోమవారం రక్తదానం చేశారు. నెహ్రూ యువకేంద్ర ప్రోగ్రాం ఇన్‌చార్జ్ జీ శ్రీనివాసులు మాట్లాడుతూ ఆపదలో ఉన్న వారికి రక్తం అందించడం ద్వారా వారి ప్రాణాలు నిలబడతాయన్నారు. అనంతరం రక్తదానం చేసినవారికి సర్టిఫికెట్లు అందించారు. కార్యక్రమంలో ఎస్సార్ ఎడ్యుకేషనల్ సొసైటీ సుంకర రమేష్, ఎన్‌ఎస్‌ఎస్ వలంటీర్ జయ, మారుతీ, నందిత, రవీంద్ర, గణేష్, పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి బాల్ బ్యాడ్మింటన్ పోటీలకు ఎంపిక



రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైన విద్యార్థులు

రాప్తాడు: స్థానిక ఏపీ మోడల్ స్కూల్ విద్యార్థులు ఫణి ప్రకాష్, తన్మయశ్రీ జిల్లా స్థాయి పోటీల్లో అత్యంత ప్రతిభ కనబరచి రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికయ్యారని ప్రిన్సిపాల్ పద్మజాదేవి, పీఈటీ బాలగొండ మల్లికార్జున సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈనెల 3న అనంతపురంలోని ఆర్ట్స్ కళాశాలలో జరిగిన బ్యాడ్మింటన్ రాష్ట్రస్థాయి సబ్ జూనియర్ విభాగంలో జిల్లా జట్టుకు ఎంపికయ్యారన్నారు. ఈ పోటీల్లో ఫణిప్రకాష్, తన్మయశ్రీ ప్రతిభ కనబరిచి, రాష్ట్రస్థాయికి ఎంపికయ్యారన్నారు. నెల్లూరు జిల్లాలో జరగనున్న రాష్ట్రస్థాయి పోటీల్లో వీరు పాల్గొంటారన్నారు. వీరిని పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు అభినందించారు.

పందిరంత ప్రకృతి ప్రేమికుడు పెద్దన్న..







ప్రకృతిలో అనేక చెట్ల జాతులు ఉన్నాయి. ఎత్తయినవి కొన్నయితే..తీగజాతివి మరికొన్ని.. వాటిలో ఆహ్లాదాన్ని పంచేవి, ఆరోగ్యాన్ని అందించేవి ఇలా ఎన్నో.. చెట్లు పెంచితే ప్రాణవాయువు ఇస్తాయి..తుంచితే పర్యావరణానికి ముప్పు తెస్తాయి.. చెట్ల ద్వారా అనేక ప్రయోజనాలు ఉన్నాయి. పండ్లు, బెండ్లు, బెరడుతో పాటు ఆకులు, అలములు కూడా ఉపయోగమే. వాటిలో ఎన్నో దివ్య ఔషధగుణాలున్నాయని ఆయుర్వేద వైద్యశాస్త్రం చెప్తోంది. అందుకే ఇంటిముందు ఒక మొక్క అయినా పెంచితే అందంతోపాటు హాయినిస్తుందని ప్రతి ఒక్కరూ అనుకుంటారు. నగరంలోని నాల్గో రోడ్డులో నివాసం ఉంటున్న సీపీఐఎంఎల్ నేత పెద్దన్న ఇంటిముంగిట తిప్ప తీగ నాటాడు. 'తిక్క తీగ' కదా అని తుంచకుండా పెంచడంతో అది పైకప్పు అంతా పాకిపోయి పందిరిలా అల్లుకుపోయింది. ఇంటిలోపలికి వెళ్తే ఆరోగ్యంతోపాటు హాయిని ఇస్తోంది.. ఇంటి బయటి నుంచి చూసే వారికి పొదరిల్లులా కనిపిస్తోంది. అటుగా వెళ్తున్నవారందరూ ప్రకృతి ప్రేమికుడు పెద్దన్న పొదరిల్లును చూసి పచ్చదనాన్ని ఆస్వాదిస్తున్నారు. – సాక్షి ఫొటోగ్రాఫర్, అనంతపురం:

సీఎంఆర్‌ఎఫ్ నిధులతో లివర్ ట్రాన్స్‌ప్లాంటేషన్



ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న బాధితుడు పెద్దిరెడ్డి

రాప్తాడు: మండలంలోని గొల్లపల్లికి చెందిన పెద్దిరెడ్డి లివర్ సంబంధిత వ్యాధితో కొంత కాలంగా బాధపడుతున్నాడు. హైదరాబాద్‌లోని యశోద ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. లివర్ ట్రాన్స్‌ప్లాంట్ చేయడానికి దాదాపు రూ.30 లక్షలు అవసరమవుతుందని వైద్యులు తెలిపారు. దీంతో బాధిత కుటుంబసభ్యులు శస్త్రచికిత్స చేయించేందుకు స్థోమత లేకపోవడంతో ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డిని కలిసి విన్నవించారు. స్పందించిన ఎమ్మెల్యే.. ముఖ్యమంత్రి సహాయ నిధి కింద (ఎల్‌ఓసీ–లెటర్ ఆఫ్ క్రెడిట్) లివర్ ట్రాన్స్ ప్లాంట్‌కు ముందస్తుగా రూ.10 లక్షలు మంజూరు చేయించారు. బాధితుడికి శస్త్రచికిత్స విజయవంతంగా పూర్తయ్యిందని, ప్రస్తుతం ఆరోగ్యంగా ఉన్నట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. శస్త్రచికిత్సకు సాయం చేయించిన ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్ రెడ్డి, ఆయన సోదరులు తోపుదుర్తి రాజశేఖర్‌రెడ్డి, తోపుదుర్తి చంద్రశేఖర్ రెడ్డికి కుటుంబ సభ్యులు కృతజ్ఞతలు తెలియజేశారు.

మార్కెట్లోకి 'హోండా ఎలివేట్'



హోండా ఎలివేట్ కారును మార్కెట్లోకి విడుదల చేస్తున్న డీటీసీ వీర్రాజు

అనంతపురం సెంట్రల్: ప్రముఖ హోండా కార్ల కంపెనీ సరికొత్త 'ఎలివేట్' కారును మార్కెట్లోకి ప్రవేశపెట్టింది. సోమవారం నేషనల్ పార్కు సమీపంలోని ప్రీమియం హోండా కార్ షోరూంలో నూతన కారును ఉప రవాణా కమిషనర్ వీర్రాజు చేతుల మీదుగా ప్రారంభించారు. డీటీసీ వీర్రాజు మాట్లాడుతూ అనేక ఫీచర్లతో వచ్చిన ఈ కారు మార్కెట్లో మంచి డిమాండ్ ఉంటుందని ఆకాంక్షించారు. అలాగే ప్రతి ఒక్కరూ రోడ్డు నిబంధనలు పాటించాలన్నారు. రవాణా శాఖ, పోలీసుశాఖ సమన్వయంతో ప్రజల భద్రతకు చొరవ తీసుకుంటున్నట్లు తెలిపారు. హోండా షోరూం అధినేత నారాయణరెడ్డి మాట్లాడుతూ ఆరు ఎయిర్‌బ్యాగ్స్, 220 ఎంఎం గ్రౌండ్ క్లియరెన్స్, 458 ఎల్‌టీఆర్‌ఎస్ బూట్ స్పేస్, ఏసీఈ బాడీ, 4312 ఎంఎం పొడవు, 1790 ఎంఎం వెడల్పు, 1650 ఎంఎం ఎత్తు కారు ప్రత్యేకతలు ఉన్నాయన్నారు. అత్యాధునిక ఫీచర్లతో హోండా కంపెనీ తయారు చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో ఎంవీఐ రమణారెడ్డి, హోండా కస్టమర్లు పాల్గొన్నారు.

ఆలయ అభివృద్ధికి మరింత కృషి



శివాలయ గోపురం నిర్మాణానికి రూ.లక్ష పంపిణీ చేసిన వైఎస్సార్ సీపీ సీనియర్ నాయకులు

రాప్తాడు: శివాలయం అభివృద్ధికి మరింత కృషి చేస్తానని వైఎస్సార్ సీపీ సీనియర్ నాయకులు తోపుదుర్తి రాజశేఖర్‌రెడ్డి అన్నారు. ఆలయ గోపురం నిర్మాణానికి సాయం చేయాలని ఆలయ కమిటీ నిర్వాహకులు, గ్రామపెద్దలు ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్ రెడ్డిని కోరారు. ఎమ్మెల్యే ఆదేశాల మేరకు ఎమ్మెల్యే సోదరుడు తోపుదుర్తి రాజశేఖర్ రెడ్డి సోమవారం మరూరు గ్రామంలో రూ.లక్ష నగదును ఆలయ కమిటీ సభ్యులు ముసలప్ప, నరసింహులుకు అందించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ శివాలయాన్ని మరింత సుందరంగా, పర్యటక కేంద్రంగా అభివృద్ధి చేసేందుకు కృషి చేస్తామన్నారు. కార్యక్రమంలో ఆలయకమిటీ సభ్యులు నరసింహులు, నారాయణ, మాజీ సర్పంచు సాకే వెంకటేష్, వైఎస్సార్ సీపీ నాయకులు మాచిరెడ్డి చెన్నారెడ్డి, పరుశ్ రామ్, హరికృష్ణ, కర్ణాప్రసాద్, పసుపుల కృష్ణ, పసుపుల రవి, రమణ తదితరులు పాల్గొన్నారు.

శింగనమలలో 48.2 మి.మీ వర్షపాతం



శనగలగూడూరులో పారుతున్న వర్షపునీరు

శింగనమల: నియోజకవర్గంలో ఆదివారం రాత్రి, సోమవారం వర్షం పడింది. దీంతో వంకలు, వాగుల్లో నీరు పారింది. శింగనమల మండలంలో 48.2 మి.మీ , గార్లదిన్నె మండలంలో 47.4 మి.మీ, బుక్కరాయసముద్రం మండలంలో 30.2 మి.మీ, నార్పల మండలంలో 31.4 మి.మీ, పుట్లూరు మండలంలో 41.6 మి.మీ, యల్లనూరు మండలంలో 23.8 మి.మీ. వర్షపాతం నమోదైంది. పదును వర్షం కురవడంతో రైతులు ఊపిరిపీల్చుకున్నారు.

చెన్నేకొత్తపల్లి వైస్‌ఎంపీపీ-2గా పల్లెన్నగారి జ్యోతి



జ్యోతికి డిక్లరేషన్ ఫాం అందిస్తున్న అధికారులు, తోపుదుర్తి చంద్రశేఖర్ రెడ్డి

చెన్నేకొత్తపల్లి: మండల పరిషత్ ఉపాధ్యక్షురాలు-2గా పల్లెన్నగారి జ్యోతి సోమవారం ప్రమాణ స్వీకారం చేశారు. స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో ఎంపీడీఓ గంగావతి అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో జ్యోతితో ప్రొసీడింగ్ ఆఫీసర్ గోపాల్‌రెడ్డి ప్రమాణ స్వీకారం చేయించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకులు తోపుదుర్తి చంద్రశేఖర్ రెడ్డి హాజరయ్యాడు. నూతనంగా ఎన్నికైన వైస్ ఎంపీపీ-2ను ఆయన అభినందించారు. కార్యక్రమంలో ఎంపీపీ అంజలి, జెడ్పీటీసీ గోవిందరెడ్డి, నాయకులు గాలిశ్రీనివాస రెడ్డి, ఎస్‌టీడీ శ్రీనివాసరెడ్డి, సింగం హనుమంత రెడ్డి, సర్పంచ్ ధనశ్రీ సింగిల్ విండో అధ్యక్షుడు డోలు రామచంద్రా రెడ్డి , ఎంపీటీసీలు పాల్గొన్నారు.

ఎమ్మెల్యేను విమర్శించే అర్హత టీడీపీకి లేదు

చెన్నేకొత్తపల్లి:రాప్తాడు నియోజకవర్గ ప్రజల సంక్షేమమే ధ్యేయంగా పాటుపడుతున్న ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డిని విమర్శించే అర్హత పరిటాల సునీత, టీడీపీ నాయకులకులేదని వైఎస్సార్‌సీపీ నేత తోపుదుర్తి చంద్రశేఖర్ రెడ్డి అన్నారు. సోమవారం మండల కేంద్రంలో జరిగిన వైస్ ఎంపీపీ-2 ఎన్నికకు ఆయన హాజరయ్యారు. అనంతరం విలేకరులతో మాట్లాడారు. ఎమ్మెల్యే ప్రకాష్ రెడ్డి అధికారంలో లేనినాడే నియోజకవర్గంలోని అన్ని మండలాల్లో పేదలకు సొంత నిధులతో బోర్లు వేయించారని, గొర్రెల పంపిణీ చేసి, బడుగుబలహీన వర్గాల వారికి అండగా నిలిచారన్నారు. 25 ఏళ్లుగా పరిటాల కుటుంబ సభ్యులు అధికారాన్ని అడ్డుపెట్టుకొని అరాచకాలు సాగించారన్నారు. అధికారంలో ఉన్నా వారు ప్రజలకు చేసిందేమీలేదన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ అంజలి, జెడ్పీటీసీ గోవింద రెడ్డి, నాయకులు పాల్గొన్నారు.

రైతు సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం



రైతులకు విత్తనాలు పంపిణీ చేస్తున్న జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ బోయ గిరిజమ్మ

రాప్తాడు: రైతు సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయమని జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ బోయ గిరిజమ్మ అన్నారు. సోమవారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో ఎస్సీ కార్పొరేషన్ ఆధ్వర్యంలో నియోజకవర్గంలోని ఆరు మండలాల్లోని 285 మంది షెడ్యూల్ కులాల రైతులకు సేంద్రియ వ్యవసాయాన్ని ప్రోత్సహించేందుకు రూ.28.50 లక్షలు విలువ చేసే విత్తనాలు, కూరగాయల విత్తనాల కిట్లు, పరికరాలను రైతులకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో బోయ గిరిజమ్మ మాట్లాడుతూ ప్రధానమంత్రి అనుసూచిత జాతి అభ్యుదయ యోజన పథకం (పీఎంఏజేఏవై) కింద నియోజకవర్గంలో ప్రకృతి వ్యవసాయం చేస్తున్న ఎస్సీ రైతులకు ఒక్కొక్కరికి రూ.10 వేలు విలువ చేసే వివిధ విత్తనాల కిట్లు రాయితీతో అందిస్తున్నట్లు తెలిపారు. వేరుశనగ, పెసలు, రాగులు, కొర్రలు, జొన్నలు, మొక్కజొన్నలు, సజ్జలు, కందులతో పాటు కిచెన్ గార్డెన్ కిట్లు అందిస్తున్నట్లు తెలిపారు. ఈ కిట్లను రైతులు సద్వినియోగం చేసుకుని ప్రకృతి వ్యవసాయ పద్ధతిలో పంటలు పండించి ఆర్థికంగా ఎదగాలన్నారు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వం కూడా రైతుల అభివృద్ధికి ఎన్నో పథకాలను ప్రవేశ పెట్టడం జరిగిందన్నారు. ఎస్సీ కార్పొరేషన్ ఈడీ సారయ్య మాట్లాడుతూ ఎస్సీ రైతుల అభివృద్ధికి ప్రభుత్వం అనేక సంక్షేమ పథకాలను ప్రవేశ పెట్టడం జరిగిందన్నారు. రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఎంపీపీలు చిట్రెడ్డి జయలక్ష్మి గుజ్జల వరలక్ష్మీ, వైస్ ఎంపీపీ బోయ రామాంజనేయులు, ఎంపీడీఓ సాల్మన్, ఏఈఓ శంకరయ్య, ఏడీఏ రవి, సత్యసాయి జిల్లా అగ్రిబోర్డ్ చెర్మన్ రమణా రెడ్డి, ఏఓ శేఖర్ రెడ్డి, అనంతపురం, రాప్తాడు మండలాల అగ్రిబోర్డు చెర్మన్లు సుబ్బారెడ్డి, కేశవ రెడ్డి, బీసీ సెల్ నాయకుడు పసుపుల ఆది, వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ జూటూరు శేఖర్, సర్పంచు సాకే తిరుపాలు తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి పోటీలకు సిద్దరాంపురం విద్యార్థులు



ప్రతిభ కనబరిచిన విద్యార్థులతో పాఠశాల యాజమాన్యం

బుక్కరాయసముద్రం: మండలంలోని సిద్దరాంపురం జెడ్పీ హైస్కూల్ విద్యార్థులు రాష్ట్ర స్థాయి బాల్ బ్యాడ్మింటన్ పోటీలకు ఎంపికైనట్లు పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు నీరజ, పీడీ శంకర్ సోమవారం తెలిపారు. సబ్ జూనియర్ విభాగంలో పాఠశాల విద్యార్థులు రోహిత్‌రెడ్డి, సిరివెన్నెల జూనియర్ విభాగంలో రాజేశ్వరి, తేజశ్విని జిల్లాలో స్థాయిలో అత్యంత ప్రతిభ కనబరిచారన్నారు. వీరు త్వరలో నెల్లూరు, చిత్తూరులో జరగనున్న రాష్ట్రస్థాయి బాల్‌బ్యాడ్మింటన్ అండర్ (16–19) పోటీల్లో పాల్గొంటారన్నారు. ప్రతిభ కనబరిచిన విద్యార్థులను పాఠశాల ఉపాధ్యాయులు అభినందించారు.

8న 'గడప గడపకూ మన ప్రభుత్వం'



సమావేశంలో మాట్లాడుతున్న అధికారులు

ఆత్మకూరు: ఈనెల 8న ఆత్మకూరు మేజర్ పంచాయతీలో గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఇన్‌చార్జ్ ఎంపీడీఓ శివశంకర్ తెలిపారు. సోమవారం ఆత్మకూరు సచివాలయం-1లో గ్రామ సచివాలయ ఉద్యోగులు, వలంటీర్లతో సమావేశం ఏర్పాటు చేశారు. ఈవోఆర్డీ దామోదర్‌రెడ్డి మాట్లాడుతూ మేజర్ పంచాయతీలో పరిధిలో సంక్షేమ పథకాలు అర్హులై ఉండి కూడా అందని వారిని గుర్తించాలన్నారు. ప్రతి గడపకూ ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి తిరిగి, ప్రజలతో మాట్లాడతారన్నారు. గ్రామ వలంటీర్లు వారి పరిధిలోని ప్రజల సమస్యలు తెలుసుకోవాలన్నారు. అధికారులు కూడా కార్యక్రమంలో పాల్గొన్నాలన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ హేమలత, సర్పంచ్ వరలక్ష్మి, ఉప సర్పంచ్ తైదుల శివారెడ్డి, సచివాలయ ఉద్యోగులు, వలంటీర్లు పాల్గొన్నారు.

కమిషనర్ భాగ్యలక్ష్మికి సెలక్షన్ గ్రేడ్ హోదా



అనంతపురం క్రైం: అనంతపురం నగరపాలక సంస్థ కమిషనర్ కే భాగ్యలక్ష్మికి సెలక్షన్ గ్రేడ్ హోదా లభించింది. కమిషనర్‌గా ఉన్న భాగ్యలక్ష్మికి పదోన్నతి కల్పిస్తూ స్పెషల్ చీఫ్ సెక్రటరీ వై. శ్రీలక్ష్మి సోమవారం ఉత్తర్వులు జారీచేశారు. కమిషనర్ భాగ్యలక్ష్మికి ఇప్పటికే స్పెషల్ గ్రేడ్ హోదా ఉన్న విషయం విదితమే. అదేవిధంగా ధర్మవరం కమిషనర్ బీ శేషన్నకు స్పెషల్ గ్రేడ్ నుంచి సెలక్షన్ గ్రేడ్ హోదా వచ్చింది.

ఆయాల పదోన్నతుల్లో నిర్లక్ష్యం తగదు

అనంతపురం సెంట్రల్: జిల్లాలో అంగన్‌వాడీ హెల్పర్లకు పదోన్నతుల విషయంలో అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని అంగన్‌వాడీ వర్కర్స్, హెల్పర్స్ యూనియన్ అధ్యక్షురాలు శకుంతల, కార్యదర్శి రమాదేవి, కోశాధికారి జమున మండిపడ్డారు. సోమవారం ఇన్‌చార్జ్ పీడీ శ్రీదేవిని కలిసి వినతిపత్రం అందించారు. నగరంలో కృపానందనగర్, రూరల్‌లో మరూరు, బొమ్మేపర్తి, ముట్టాల, కళ్యాణదుర్గంలో పరిధిలోని ముదిగల్లు, మానిరేవు, వన్నూరుస్వామి కొండ, బుక్కరాయసముద్రం-2, తాడిపత్రి ప్రాజెక్టులో ఊరిచింతల, విడపనకల్లు-2 హెల్పర్ల పదోన్నతులు పెండింగ్‌లో ఉన్నాయన్నారు. అనంతపురం రూరల్ సీనియర్ అసిస్టెంట్‌ను బదిలీ చేయాలని డిమాండ్ చేశారు. సమస్యలను పరిష్కరించకపోతే ఈనెల 11న పీడీ కార్యాలయం ముట్టడి చేస్తామని హెచ్చరించారు.

అనంత కళాకారులకు గ్రేడింగ్‌లు

అనంతపురం కల్చరల్: దేశవ్యాప్తంగా దూరదర్శన్ ద్వారా ఇచ్చే గ్రేడింగ్‌లకు అనంత కళాకారులకు ఎంపికయ్యారు. జిల్లాకు చెందిన ప్రముఖ నాట్యాచార్యులు సంధ్యామూర్తి శిష్యబృందం మహాలక్ష్మి, ప్రత్యూష, అంజు భార్గవి, నాగహిమజ, కూచిపూడిలో, సుధీర, దివ్యశ్రీ, కావ్య, భరత నాట్యంలో బీ గ్రేడ్ నృత్యకారులుగా గుర్తింపు దక్కింది. మరో నాట్యాచార్యుడు పట్నం శివప్రసాద్ శిష్యుడు సోమనాథ్ భరద్వాజ్ కూడా కూచిపూడిలో బీ గ్రేడ్ నృత్యకారుడిగా గుర్తింపు వచ్చింది. అనంత కళాకారులకు గ్రేడింగ్‌లు ఇవ్వడంతో శాస్త్రీయ నృత్యంలో విరివిగా అవకాశాలు రానున్నాయి.

హెల్మెట్ ధరించాలి

నార్పల: ద్విచక్ర వాహనదారులు ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని ఎస్‌ఐ రాజశేఖర్‌రెడ్డి సూచించారు. సోమవారం ఆయన నార్పల క్రాసింగ్‌లో వాహనాలను తనిఖీ చేశారు. హెల్మెట్ ధరించకుండా, వాహన రికార్డులు లేకుండా, నిబంధనలకు విరుద్ధంగా వాహనాలు నడుపుతున్న వారికి జరిమానా విధించారు. అనంతరం నిబంధనలపై అవగాహన కల్పించారు.

యన్నం రాజు.. సాఫ్ట్ మనసు

- మూడు గ్రామాల్లో ఇళ్ల వద్దకెళ్లి భోజనం అందజేత
- వృద్ధులు, దివ్యాంగుల ఆకలితీరుస్తున్న దాత యన్నం రాజశేఖర్‌రెడ్డి
- తల్లిదండ్రుల జ్ఞాపకార్థం అన్నదాన సేవ

అన్నమో రామచంద్రా.. అని అలమటించే వారికి అన్నదాతా సుఖీభవ అని ఎందరో అభాగ్యుల ఆకలి తీరుస్తున్నారు ఆత్మకూరు మండలం పి.యాలేరుకు చెందిన యన్నం రాజశేఖర్‌రెడ్డి. హైదరాబాదులోని సాఫ్ట్‌వేర్ కంపెనీలో ఉద్యోగం చేస్తూ... తల్లిదండ్రులు యన్నం రాజశేఖర్ రెడ్డి, శౌరీలమ్మ జ్ఞాపకార్థం సొంతూరులో సాఫ్ట్‌గా సేవ చేయాలని భావించారు.. అనుకున్నదే తడవుగా రోజూ వృద్ధులు, దివ్యాంగుల ఆకలితీరుస్తున్నారు. ఇద్దరు వ్యక్తులను ఏర్పాటు చేసుకొని రోజూ ఉదయం టిఫిన్, రాత్రికి భోజనం అందిస్తున్నారు. సేవకంటే స్వలాభం చూసుకునే వారున్న ఈ రోజుల్లో ఆయన సేవాభావాన్ని ఎందరో కొనియాడుతున్నారు. – ఆత్మకూరు :

ఆత్మకూరు మండలం పి.యాలేరుకు గ్రామానికి చెందిన యన్నం రాజశేఖర్‌రెడ్డి హైదరాబాద్‌లో ఇరవై ఏళ్లుగా ఓ ప్రైవేట్ కంపెనీలో సీనియర్ వైస్ ప్రెసిడెంట్ హోదాలో కొనసాగుతున్నారు.

తన తల్లిదండ్రులు యన్నం రాజశేఖర్‌రెడ్డి, శౌరీలమ్మ జ్ఞాపకార్థం సేవా కార్యక్రమానికి శ్రీకారం చుట్టాడు. మన అనుకున్న వాళ్లే పట్టించుకోని ఈ రోజుల్లో.. వృద్ధులు, దివ్యాంగుల ఆకలి బాధ తెలుసుకొని అన్నదాన సేవ చేయడానికి సంకల్పించాడు. ఎవరైనా అనారోగ్యంగా ఉన్నా , ఆర్థిక స్థోమతలేక చదువుకునేందుకు ఇబ్బంది పడుతున్నా చేయూతనిస్తున్నాడు.

సేవా కార్యక్రమానికి శ్రీకారం చుట్టిందిలా...

2017లో యన్నం రాజశేఖర్‌రెడ్డి పంచాయతీ కార్యాలయం వద్దకు వచ్చే పింఛన్ కోసం వచ్చేవారికి అన్నదానం చేసేవాడు. ఆతర్వాత ఆత్మకూరు, పి.యాలేరు, సిద్దరాంపురం ఈ మూడు గ్రామాల్లో నిస్సహాయులు, నడవలేక మంచానికే పరిమితమైన వారు దాదాపు 56 మందికి ఉదయం టిఫిన్, సాయంత్రం భోజనం అందిస్తున్నాడు. పి.యాలేరులో ఇద్దరు వ్యక్తులకు నెలకు రూ.15వేలు వేతనం ఇచ్చి సేవా కార్యక్రమం కొనసాగిస్తున్నాడు. ఇంటివద్దనే భోజనం చేయిస్తూ, పార్సిళ్లు కట్టి ద్విచక్రవాహనాల్లో ఇళ్లవద్దకు వెళ్లి అందిస్తున్నారు. ఉదయం పూట టిఫెన్‌లో ఇడ్లీ, దోసె, చపాతి, పూరి, ఉగ్గాని, పొంగల్ ..ఇలా రోజుకో రకం టిఫిన్ అందిస్తున్నాడు. సాయంత్రం అన్నం, పప్పు, సాంబార్, రసం అందిస్తున్నారు. ఇటీవల కాలంలో పి.యాలేరు గ్రామంలో ఓ వృద్ధాశ్రమం ఏర్పాటు చేసి, వృద్ధుల బాగోగులు చూసుకుంటున్నారు.



యాలేరులో ఇంట్లోనే భోజనం తయారు చేస్తున్న దృశ్యం

కన్నకొడుకులా చూసుకుంటున్నాడు



సొంతవారే పట్టించుకోని ఈ రోజుల్లో మనసున్న మారాజులా వేళకు ఉదయం టిఫెన్, సాయంత్రం భోజనం ఇంటి దగ్గరకు పంపిస్తున్నాడు. నాలాంటి వృద్ధులు, దివ్యాంగులు, ఎవరూలేని వారికి రెండుపూటలా ఆకలితీరుస్తున్నాడు. ఆయన చల్లగా ఉండాలి.
– నారక్క, ఆత్మకూరు

పదిమందికి సేవ చేయాలని..

జీవితంలో ఎంత సంపాదించినా, అందులో సుఖం ఉండదు. పదిమందికి మంచి చేయడంలోనే ఆనందం ఉంటుందని మా తల్లిదండ్రులు చెప్పారు. వారు చెప్పిన మాటను ఆచరణలో పెడుతున్నా. తల్లిదండ్రుల జ్ఞాపకార్థం మూడేళ్లుగా ఆత్మకూరు, సిద్దరాంపురం, పి.యాలేరులో అన్నదానం, సేవా కార్యక్రమాలు చేస్తున్నా. అన్నదానం నిరంతరంగా చేస్తుంటే చాలా సంతోషంగా ఉంది.
– యన్నం రాజశేఖర్‌రెడ్డి, సాఫ్ట్‌వేర్ ఇంజనీర్



ప్రత్యామ్నాయ పంటల సాగుకు అనుకూలం

బుక్కరాయసముద్రం: ప్రస్తుతం కురుస్తున్న వర్షాలు ప్రత్యామ్నాయ పంటల సాగుకు అనుకూలమని ఆచార్య ఎన్జీరంగా వ్యవసాయ పరిశోధన స్థానం అధిపతి, ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ సహదేవరెడ్డి తెలిపారు. రైతులు పొలాల్లో ఉలవ, పెసర, అలసంద, అనప పంటలను విత్తుకోవచ్చన్నారు. జిల్లాలో అల్ప పీడనంతో కురుస్తున్న వర్షాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. జిల్లాలో ఇది వరకు సాగు చేసిన ఆముదం పంటలకు ఎకరాకు 15 కేజీల యూరియాను వేసుకోవాలన్నారు. ఆముదం, కంది పంటలలో నీటి సంరక్షణ సాళ్లను చేసుకోవాలన్నారు. బెట్టకు గురైన కంది, ఆముదం, వేరుశనగ పంటలలో బెట్ట నుంచి త్వరగా కోలుకోవాలంటే వర్షం ఆగిపోయిన వెంటనే పొటాషియం నైట్రేట్ (13-0-45) లీటరు నీటికి 5 గ్రాములు లేదా 19-19-19 , యూరియా 10 గ్రాములు కలిపి పిచికారీ చేయాలన్నారు. తద్వారా బెట్ట నుంచి కోలుకుంటుందన్నారు.